క్లుప్తంగా

రంగనాథుడి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను రాష్ట్ర కమ్యూనికేషన్స్ వింగ్ డీఐజీ లక్ష్మి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు కళానివాళి



నెల్లూరు(బృందావనం): మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు పద్మారత్నం కళాత్మకంగా నివాళులర్పించారు. బెలూన్‌పై మూడు సెంటీమీటర్ల పరిమాణం, కోడిగుడ్డుపై మూడు సెంటీమీటర్లలో జగ్జీవన్‌రామ్ చిత్రాలను తీర్చిదిద్దారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. బాలాజీనగర్‌కు చెందిన సురేష్‌కుమార్ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఓ స్వీట్స్ దుకాణంలో ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు.

గుండాలమ్మపాలెంలో ఫ్యామిలీ డాక్టర్




కొడవలూరు : మండలంలోని గుండాలమ్మపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గర్భిణులు, అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటున్న వారి గృహాలకు వెళ్లి పరీక్షలు చేసి వైద్య సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాలచంద్రబాబు మాట్లాడుతూ ఆస్పత్రికి రాలేని వారికి ఇంటి వద్దే వైద్య సేవలందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎస్ ఎన్.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్కే.రోషద, హెచ్ఏలు ఎస్కే.షఫీ ఉద్దీన్, బి.విజయలక్ష్మి, ఆశా కార్యకర్త పి.శైలజ పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

కోవూరు : ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ



ముత్తుకూరు : గతంలో ముత్తుకూరు పంచాయతీలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ఏపీ లోకాయుక్త జేడీ(సీఐడీ) గంగరాజు మంగళవారం విచారణ చేపట్టారు. షఫీఉల్లా తదితరులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించారు. నిధుల దుర్వినియోగం, బినామీదారులు పనులు చేయడం, రికార్డుల తారుమారు తదితర ఆరోపణలపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం పలు ప్రాంతాల్లో జరిగిన పనులు, వాటి నాణ్యతను పరిశీలించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈఓ పీఆర్‌డీ, సచివాలయ సిబ్బంది, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా



మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో వేలాది మందికి పార్టీలకతీతంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రభుత్వం అందిస్తోందని, దీని ద్వారా వారికి ఆర్థిక భరోసా లభిస్తోందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం 2196 స్వయం సహాయక సంఘాల్లోని 19358 మంది గ్రూపు సభ్యులకు రూ.15.87 కోట్ల మేర చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నగర నియోజకవర్గంలో అమ్మఒడి పథకాన్ని దాదాపు 20 వేల కుటుంబాలకు, వైఎస్సార్ చేయూతను 15 వేల కుటుంబాలకు, వైఎస్సార్ ఆసరా పథకాన్ని దాదాపు 20 వేల మంది మహిళలకు అందజేస్తున్నారని వివరించారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తామూ అందిస్తామని టీడీపీ నేతలు చెప్తున్నారని, అలా అయితే ఆయన చేస్తున్న పనులు తప్పెలా అవుతాయని ప్రశ్నించారు. తానెప్పుడూ ప్రజల్లోనే తిరుగుతూ అందర్నీ పలకరిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నానని చెప్పారు. నాలుగేళ్ల నుంచి కనిపించని ఓ వ్యక్తి 2024లో మరోసారి తనపై పోటీ చేస్తారని చెప్తున్నారని, కరోనా.. వరదలొచ్చిన సమయంలో ప్రజలెలా ఉన్నారో సైతం సదరు వ్యక్తి పట్టించుకోలేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో రూ.150 కోట్లు ఖర్చు చేసి తనపై గెలుస్తారంటున్నారని, అందులో రూ.50 కోట్లను కరోనా కష్టకాలంలో ఖర్చు చేసి ఉంటే ఎన్నో వేల కుటుంబాల బాగుపడేవని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని 2024లోనూ సీఎంను చేసుకునేలా ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో ముందుకెళ్తున్నాం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ముందుకెళ్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్లో గల గుర్రాలమడుగు సంఘంలో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడారు. సర్వేపల్లి కాలువకు సంబంధించిన పనులు దాదాపు 75 శాతం పూర్తయ్యాయని, ఉడ్‌హౌస్ సంఘం, సీఆర్పీ డొంక వద్ద కొంత పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సాగునీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో నెల్లో ఎంత వరకు పనులు చేయగలరో అంత మేర చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు పూర్తయ్యాక నగర రూపురేఖలు మారుతాయని చెప్పారు. కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 18 పంచాయతీల పొదుపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కులను మినీబైపాస్ రోడ్డులోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలు పడుతున్న ఇబ్బందులను పాదయాత్ర సమయంలో గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించి పొదుపు మహిళలకు అందిస్తున్నారని కొనియాడారు. రూరల్ పరిధిలోని 627 పొదుపు సంఘాల్లో 62,974 మంది మహిళలు ఉన్నారని, వీరికి దాదాపు రూ.5.76 కోట్లను అందించామని పేర్కొన్నారు. ఆసక్తి గల పొదుపు మహిళల స్వయం ఉపాధికి డీఆర్డీఏ ద్వారా వివిధ యంత్రాలను అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎంకు మహిళలు అండగా నిలవాలని కోరారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తానని చెప్పారు.



హాజరైన పొదుపు మహిళలు

విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, నరసింహకొండ దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ వెంకయ్య, నేతలు హరిబాబుయాదవ్, పెంచలరెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు చేపట్టారు. అనంతరం మహిళల స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన యంత్ర పరికరాల ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు.

చట్టాలపై అవగాహన అవసరం

నెల్లూరు రూరల్: చట్టాలపై అవగాహన అవసరమని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. పడారుపల్లిలోని సచివాలయంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సీనియర్ సిటిజన్లపై కుటుంబసభ్యులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చట్టాలున్నాయని చెప్పారు. న్యాయపరమైన వివిధ సమస్యల పరిష్కారానికి గానూ న్యాయసేవలను ఉచితంగా అందించనున్నామని వివరించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

ఘనంగా మహవీర్ జన్మకల్యాణక్ వేడుకలు





నెల్లూరు(బృందావనం): మండపాలవీధిలోని జైన మందిరంలో భగవాన్ మహవీర్ జన్మ కల్యాణక్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహవీర్ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పల్లకిలో ప్రతిష్ఠించి ఊరేగించారు. కార్యక్రమానికి నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. భగవాన్ మహవీర్ జన్మవృత్తాంతాన్ని జైన మత గురువు ముని రాజ్ వైభవ్ రత్న విజయ్ వివరించారు. నెల్లూరు నగర జైన్ సంఘ్ ప్రెసిడెంట్ ధీర్మల్‌జైన్ పర్యవేక్షించారు.

అక్రిడిటేషన్ల రెన్యువల్‌కు వినతి

నెల్లూరు (అర్బన్): కొత్త అక్రిడిటేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేసేంత వరకు ఉన్న కార్డులను రెన్యువల్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని కలెక్టరేట్లో మంగళవారం అందజేసిన అనంతరం సంఘ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. మార్చి 31 నాటికి అక్రిడిటేషన్ల గడువు ముగిసిందన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అక్రిడిటేషన్ కమిటీలో యూనియన్లకు ప్రాధాన్యం కల్పించాలని, ప్రతి మండలంలో కనీసం 100 పత్రికలు ఉండాలనే నిబంధనను తొలగించాలని కోరారు.



కూర్మనాథ్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నేతలు దయాశంకర్, హనోక్, సుబ్బారావు, గోపీనాథ్, సుధాకర్, సుహానా, నజీర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎస్ నాయుడి సేవలు ఎనలేనివి

నెల్లూరు (అర్బన్): స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ ఎంతో మందికి సాయపడిన ఈవీఎస్ నాయుడి సేవలు ఎనలేనివని పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని వియానీ హోమ్‌లో ఈవీఎస్ నాయుడి ప్రథమ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. అక్కడ పిల్లలకు పండ్లు, బ్రెడ్లు, తదితరాలను పంపిణీ చేశారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, నవ్యాంధ్ర రచయితల సంఘ కార్యదర్శి రాఘవేంద్ర, విశ్రాంత



ఏఎస్సై మహబూబ్‌బాషా, పీఎంపీ నేతలు సత్తార్, శేషయ్య, శ్రీనివాసులు, రాము, విలియమ్, హోమ్ నిర్వాహకులు రమా పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య సేవలు

నెల్లూరు సిటీ: దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో వైద్య శిబిరాన్ని ఎనెల్ ఆస్పత్రి సహకారంతో మంగళవారం నిర్వహించారు. గుండె వైద్యనిపుణుడు నాగేంద్రప్రసాద్, డాక్టర్ దావుద్ ఆధ్వర్యంలో సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, ఈసీజీ, వివిధ రక్త పరీక్షలను నిర్వహించారు. ఎనెల్ ఆస్పత్రి చైర్మన్ దశరథ నాగేంద్రప్రసాద్, తదితరులకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీతారామ్ కృతజ్ఞతలను తెలియజేశారు.



జనార్దన్‌రెడ్డి కాలనీలో వైద్య శిబిరం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని పెన్నా ఆస్పత్రి సహకారంతో మంగళవారం నిర్వహించారు. సీపీఎం నేత సైపుల్లా తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్లు వినోద్‌రెడ్డి, పరమజ్యోతిరావు, క్రాంతికుమార్, అమరేంద్రకుమార్, విద్యాశరణ్‌రెడ్డి, వెంకటరాజేష్, వెంకటరూపేష్, ప్రసాద్ తదితరులు వైద్యసేవలను అందించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. పార్టీ నగర కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, ప్రసాద్, సూర్యనారాయణ, జాఫర్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయంవీధి, బారాషహీద్‌దర్గా, ప్రగతి నగర్, లేక్‌వ్యూ కాలనీ, సుజాతమ్మ కాలనీ, నెల్లూరు తహసీల్దార్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదన్నారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి గదిలో ఫ్యాన్, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'నిబంధనలకు విరుద్ధంగా రెడ్‌క్రాస్ ఎన్నికలు'

నెల్లూరు(బృందావనం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్‌కు నిర్వహించిన ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని అడ్వొకేట్ అంకయ్య చౌదరి పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ అంశమై తాము హైకోర్టును ఆశ్రయించగా, ఉత్తర్వులను న్యాయస్థానం జారీ చేసిందని వివరించారు. మురళీరెడ్డి, భాస్కర్‌రావు, అడ్వొకేట్ ప్రదీప్, ఆదిత్యసాయి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ రేపు

నెల్లూరు(లీగల్): కోర్టు విధులను న్యాయవాదులు గురువారం బహిష్కరించనున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్లో కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఢిల్లీ బార్ అసోసియేషన్ న్యాయవాది వీరేందర్‌పై కాల్పులు జరిపి హత్య చేసిన ఘటనకు నిరసనగా కోర్టు విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భీమవరంలో ఇటీవల నిర్వహించిన 22వ సీనియర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన పలువురు పతకాలను సాధించారని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ మునిభాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయ్ (55 కిలోలు) స్వర్ణ పతకం, అఖిల్ (65 కిలోలు) కాంస్య పతకం, వంశీ (85 కిలోల విభాగంలో) రజత పతకాన్ని సాధించారని పేర్కొన్నారు.

పింఛన్ల అందజేత



నెల్లూరు(సెంట్రల్): రూరల్ పరిధిలోని 28వ డివిజన్లో గల శాంతినగర్‌లో పింఛన్లను మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మదన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో అర్హులకు పింఛన్లను అందించనున్నామని చెప్పారు.

నిత్యావసర సరుకుల వితరణ

నెల్లూరు(బారకాసు): అనారోగ్యంతో బాధపడుతున్న సుభాషిణి కుటుంబానికి రూ.పది వేల విలువజేసే నిత్యావసర సరుకులను శివాజీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. 'భగవంతుడా బిడ్డ కోసమైనా బతికించు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి శివాజీ యూత్ ఫౌండేషన్ సంస్థ స్పందించింది. ఈ క్రమంలో బాలాజీనగర్‌లోని మసీదు సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న సుభాషిణి ఇంటికెళ్లి వీటిని అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు భాస్కర్‌నాయుడు, రిషిత, షరీనాబేగం, కార్తికేయనాయుడు, జనన్య పాల్గొన్నారు.



పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తికి చర్యలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని నాలుగో డివిజన్లో గల న్యూ కాలనీ, పీర్లచావిడి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయాననే అంశాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం వందకుపైగా నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్పొరేటర్ లక్ష్మీప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అనిల్

పనులను వేగవంతం చేయాలి

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు పనులను వేగవంతం చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను తాడేపల్లి నుంచి మంగళవారం ఆయన నిర్వహించారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ద్వారా రీ సర్వే, రోడ్ల మరమ్మతులు, జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణం, తదితరాల్లో పురోగతిని ఆరాతీశారు. కమిషనర్ హరిత, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్ఓ వెంకటరమణ, ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన హరిత, తదితరులు

వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

నెల్లూరు (వేదాయపాళెం): మానసిక సమస్యతో బాధపడుతూ ఫిట్స్‌కు గురవుతున్న ములుమూడి వాసి మొహిద్దీన్‌కు రూ.ఐదు వేల ఆర్థిక సాయాన్ని ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ ఇచ్చారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, సభ్యులు స్వర్ణ, లలితకుమారి పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనంపై కోదండరాముడి విహారం

నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో స్వామివారు సింహవాహనం, చంద్రప్రభ వాహనంపై మంగళవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా జగదీష్, లక్ష్మి దంపతులు, అమరలింగేశ్వరరావు, సుదర్శనరావు, వెంకటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, ధర్మకర్తల మండలి చైర్మన్ రమణకుమార్, తదితరులు పర్యవేక్షించారు.



నేత్రపర్వంగా పుష్పయాగం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు, షిర్డీ సాయినాథుడి ఉత్సవాల్లో పుష్పయాగాన్ని నేత్రపర్వంగా మంగళవారం నిర్వహించారు. ఏకాంతసేవను వేడుకగా జరిపారు. 22 మంది వీణ విద్వాంసులతో వీణనాదకచేరి, సర్వేపల్లి సిస్టర్స్ ఆధ్వర్యంలో కీర్తనలను ఆలపించారు.

